క్లుప్తంగా

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



దుర్కిలో మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ సందీప్

నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్ కో ఆపరేటివ్ బ్యాంకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ సందీప్ అన్నారు. శుక్రవారం మండలంలోని దుర్కి గ్రామంలో జిల్లా కో–ఆపరేటీవ్ బ్యాంక్ ఏజీఎం అజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి కర్షక్ మిత్ర, గృహ, బంగారం రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ సందీప్,ఫీల్డ్ ఆఫీసర్ భూమేష్,సీఈవో సుధాకర్,రైతులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో రుణమేళా

రాజంపేట: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట డీసీసీబీ మేనేజర్ శాంతాదేవి అన్నారు. శుక్రవారం కొండాపూర్ గ్రామంలో రైతులకు నిర్వహించిన రుణ మేళా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బ్యాంకు రుణాలు, లాకర్ సదుపాయాలపై రైతులకు అవగాహన కల్పించారు.బ్యాంక్ సిబ్బంది, సొసైటీ సెక్రెటరీ, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



తక్కడ్‌పల్లిలో పంటను పరిశీలిస్తున్న ఏఈవో

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్, తక్కడ్‌పల్లి, ఫత్లాపూర్, రాజుల్లా ఆయా గ్రామాలలో వ్యవసాయ అధికారులు వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పుల్కల్‌లో 65 ఎకరాలు వరి, ఫత్లాపూర్‌లో 150 ఎకరాలు, హజ్జుల్‌లో 60 ఎకరాలు, రాజుల్లాలో 10, దౌల్తాపూర్‌లో 20, బిచ్కుంద శివారులో 30 ఎకరాలు వరి పంటలు వర్షంతో దెబ్బతిన్నాయని ఏఈవో శ్రీలేఖ తెలిపారు. పూర్తి సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.

50 పడకల ఆస్పత్రి మంజూరుపై సంబురాలు



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

దోమకొండ: దోమకొండలోని 30 పడకల క్లస్టర్ ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మాజీ జెడ్పీటీసీ తిరుమలగౌడ్, జిల్లా నాయకులు రామస్వామిగౌడ్, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలను వెంటనే పరిశీలించాలి



మద్నూర్(జుక్కల్): ధరణిలో భూ సమస్యలపై వచ్చిన ఆన్‌లైన్ దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. డోంగ్లీ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయంలో శుక్రవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ ధరణి, రేషన్ కార్డులు, మీ సేవా సర్టిఫికెట్‌లు, ఇతర విషయాలపై రివ్యూ చేశా రు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యలయంలో ధరణి సమస్యలపై అర్జీలను పరిశీలించి సమస్య పరిష్కారిస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ క్రాంతికుమార్, తహసీల్ సిబ్బంది ఉన్నారు.

ఫిష్ మార్కెట్‌కు స్థలం కేటాయించాలని వినతి



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రంలో చేపల మార్కెట్‌కు స్థలం కేటాయించాలని శుక్రవారం మత్స్యకారులు తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు.తహసీల్దార్ భూమి సర్వే చేయించి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు.



డీపీవోలో పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ, అధికారులు



బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ...



భిక్కనూరులోని అహ్మద్ కాలేజీలో ..

ఘనంగా జ్యోతీబా పూలే జయంతి



కామారెడ్డి టౌన్ : మున్సిపల్ ఆవరణలో పూలమాలలు వేస్తున్న చంద్రకాంత్‌రెడ్డి, విక్టర్

సాక్షి, నెట్ వర్క్ : సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతీబా పూలే జయంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పూలే విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఆవరణలో పూలే జయంతిని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, అధికారులు జ్యోతీబా పూలే, సావిత్రిబా పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతి బాపూలేకు భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడిషనల్ కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ.. జ్యోతీబా పూలే సత్య శోధక్ సమాజాన్ని ఏర్పాటు చేసి బడుగు బలహీన వర్గాలను చైతన్యం చేశాడని చెప్పారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో పూలేకు నివాళి అర్పించారు.



బిచ్కుందలో.



తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో..



ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ

వేసవిని దృష్టిలో ఉంచుకుని వసతులు కల్పించాలి



ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఎంపీడీవో సూర్యకాంత్

సాక్షి ఎఫెక్ట్..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలకేంద్రంలో ఉపాధి హామీ పనులను మండల ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 4న వచ్చిన అసౌకర్యాల మధ్య ఉపాధి పనులు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వేసవి కాలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని ఎంపీడీవో సూర్యాకాంత్ అన్నారు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్, తాగు నీటి వసతి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలీలకు వివరించారు. అనంతరం కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది బలరాం, సాయిలు, తదితరులున్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి



బాన్సువాడలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

బాన్సువాడ : చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిని సీడీపీవో సౌభాగ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో పోషణ్ పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలతో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. తల్లి పాలు ఆరు నెలల వరకు ఇవ్వాలని, ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుమలత, అంగన్‌వాడీ టీచర్లు మహాదేవి, బాలమణి, అరుణ, స్వరూప, ఇంద్రాణి, విజయ, సావిత్రి తదితరులున్నారు.

భిక్కనూరు: మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది భిక్కనూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్షోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనత, పరిశుభ్రత, ఇతర సమస్యలను వివరించారు. కార్యక్రమంలో శిరీష, సౌందర్య, తదితరలున్నారు.

మొక్కలకు నీళ్లు పోసిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ తండా ప్రకృతి వనంలోని మొక్కలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వలంటీర్లు శుక్రవారం మొక్కలకు నీళ్లు పోశారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ చంద్రకాంత్, విద్యార్థులు తదితరులున్నారు.

వన నర్సరీ పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం మైబాపూర్ గ్రామంలోని ఈజీఎస్ వన నర్సరీని శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధి కూలీలకు పలు సూచనలు చేశారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ

దోమకొండ : గ్రామాభివృద్ధిలో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు సహకరించాలని దోమకొండ గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ అన్నారు. శుక్రవారం స్థానిక ఆనంద్‌భవన్‌లో గ్రామానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామ అభివృద్ధి పనులు ప్రజాస్వామ్య బద్ధంగా తయారు చేయాలని ఉద్దేశంతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో 2024–25 సంవత్సరంలో సంస్థ చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, వాటి కొసం ట్రస్టుద్వారా చేసిన వ్యయాలను వివరించారు. కాగా గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు, జీవనోపాధులు, యువతకు నైపుణ్యాలు, మౌళిక సదుపాయాలు కల్పించాలని పలువురు సమావేశంలో సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంఈఓ విజయ్‌కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఐకెపి రాజు, రిటైర్డ్ ఎంప్లాయిస్ ప్రతినిధులు వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్న రాజులు
- పలు చోట్ల 'గావ్ చలో– బస్తీ చలో' కార్యక్రమం



నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్న రాజులు



బిచ్కుందలో మాట్లాడుతున్న అరుణతార

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్న రాజులు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని గోలిలింగాలలో శుక్రవారం 'గావ్ చలో– బస్తీ చలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బూత్‌కమిటీ సభ్యులతో, గ్రామపెద్దలతో, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై గ్రామంలోని సమస్యలపై చర్చించారు. గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రం నిర్వాహణతీరును ఆయన పరిశీలించి కేంద్రపథకాల లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. అనంతరం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10,11,12 తేదీల్లో జిల్లాలోని అన్ని గ్రామాలలో' గావ్ చలో– బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పార్టీలోని పెద్దల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడతారన్నారు.స్థానికసంస్థల ఎన్నికల్లో పెద్దమొత్తంలో సీట్లను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. ఆయనవెంట బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజ్‌మోహన్‌రెడ్డి, హన్మాండ్లు, మండల నాయకులు దేవిసింగ్, భాస్కర్, లక్ష్మినారాయణ, గోపాల్, రాజు, గణేష్, విజయ్‌గౌడ్, బుచ్చిరెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులున్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

బిచ్కుంద(జుక్కల్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ఇందుకు ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే అరుణతార అన్నారు. బండారెంజల్ గ్రామంలో 'గావ్ చలో– బస్తీ చలో' కార్యక్రమంలో వారు మాట్లాడారు. రేషన్ షాపుల బోర్డులపై సీఎం రేవంత్ ఫొటోతో పాటు పీఎం మోదీ పెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు విష్ణు, కార్యకర్తలు గంగాధర్, తదితరులు పాలొన్నారు.

ఎల్లారెడ్డి/బీబీపేట/కామారెడ్డి టౌన్ : ఎల్లారెడ్డి పట్టణం, బీబీపేట మండలకేంద్రంలో, కామారెడ్డి పట్టణం 16వ వార్డులో 'గావ్ చలో– బస్తీ చలో' కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు ప్రారంభించారు. బీబీపేటలో అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి మాట్లాడారు. కామారెడ్డి పట్టణం 16వ వార్డులో హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ చేశారు.

ఒకే దేశం ఒకే ఎన్నిక

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ నాయకులు ఒకే దేశం ఒకే ఎన్నిక అనే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు వెల్మ సంతోష్ రెడ్డి మాట్లాడారు.

ఆధ్యాత్మికం

వైభవంగా పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

భిక్కనూరు: మండల కేంద్రంలో జరుగుతున్న వనదుర్గ పెద్దమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అనంతరం అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బండి రాములు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఈ సందర్భంగా అమ్మవారిని వేడుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

రైల్వే మండపంలో సామూహిక కుంకుమార్చనలు



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కామారెడ్డి అర్బన్: శ్రీసీతారాముల కల్యాణ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక రైల్వే మండపంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శశికాంత్ శర్మ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వి.సత్యం, ప్రతినిధులు పాత రమేష్, పబ్బ జగన్నాథం, యెల్లంకి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శబరి మాత దివ్యసమాధి, ప్రతిమ, చిత్రపటాన్ని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రామ మందిరం నిర్మాణానికి విరాళాల సేకరణ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పాతూరి హనుమాన్ మందిరం ఆవరణలో రాంమందిరం ఏర్పాటు చేయడానికి భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు నిర్వహకులు పాపనొల్ల బీరయ్య పేర్కొన్నారు. ధన,వస్తు రూపేన దాతలు సహకరించి ఆలయ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు.

అయ్యప్ప మందిరంలో పూజలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గల అయ్యప్ప మందిరంలో శుక్రవారం ఉత్తరనక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అపురూప అయ్యప్ప స్వామికి అభిషేకాలు చేశారు. అయ్యప్ప సేవాసమితి ప్రతినిధులు గురుస్వామి రాజు, జనగామ రాజు, మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీరమా సత్యనారాయణ స్వామికి మండల పూజ

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని సిరిసిల్లరోడ్డు గాంధీనగర్ శ్రీరమా సహిత సత్యనారాయణ, పరివాహక దేవతామూర్తుల ప్రతిష్ఠాపన నిర్వహించిన 40 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మండల పూజ ఉత్సవం నిర్వహించారు. ప్రతినిధులు శ్రీనివాస్, సంతోష్, సురేందర్, మహేష్, వేణు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- డీపీఎం రమేశ్‌బాబు
- పలు చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



లింగంపేట : మోతెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం రమేశ్‌బాబు

లింగంపేట/నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డిరూరల్/రాజంపేట/పిట్లం/నిజాంసాగర్/పెద్దకొడప్‌గల్: రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించాలని డీపీఎం రమేశ్‌బాబు సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. లింగంపేట మండలం మోతె, కంచుమల్ గ్రామాల్లో శక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. నాగిరెడ్డిపేట మండలం అచ్చాయపల్లిలో మహిళాసంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఐకెపీ ఏపీఎం జగదీశ్ కుమార్, గ్రామ రైతులతో కలిసి ప్రారంభించారు.ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేట్ గ్రామంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత ప్రారంభించారు.రాజంపేట మండలం శివాయిపల్లి, ఆరెపల్లి గ్రామాలల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల స్పెషల్ ఆఫీసర్ అపర్ణ, తహసీల్దార్ సతీష్ రెడ్డి, ఎంపీడీవో రఘురాం, ఐకేపీ ఏపీఎం సాయిలు ప్రారంభించారు. పిట్లం మండలం కంభపూర్, సిద్దాపూర్, పాతిరెడ్డిపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగొలు కేంద్రాలను స్థానిక అధికారులు, నాయకులు ప్రారంభించారు. మహమ్మద్ నగర్ మండలం కొమలంచ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. పెద్దకొడప్‌గల్ మండలం పోచారం తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎం దూప్‌సింగ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ప్రారంభించారు.

బాధితులకు నష్టపరిహారం అందించాలి



వివరాలను తెలుసుకుంటున్న విజయ భాస్కర్

నస్రుల్లాబాద్ : జిల్లాలోని గాంధారి,నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో కల్తీ కల్లు బాధితులకు నిందితుల నుంచి నష్టపరిహారం అందించాలని జిల్లా మానవ హక్కుల కమిటీ చైర్మన్ విజయభాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉమ్మడి బీర్కూర్ మండలంలోని దుర్కి, దామరంచ గ్రామాల్లో సందర్శించి ఆయన బాధిత కుటుంబీకులను కలిసి వాస్తవ పరిస్థితిని తెలుసుకున్నారు. కొంతమందికి ఆస్పత్రిలో రూ.50వేల వరకు ఖర్చు అయిందని తెలుసుకుని నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం దామరంచ పల్లె దవాఖాను సందర్శించి డాక్టర్ సాగర్ మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు.బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట జిల్లా సహాయ కార్యదర్శి కటికెం రాజారెడ్డి, కన్వీనర్ రవీంద్ర రెడ్డి, తదితరులున్నారు.

సంక్షిప్తం

పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని కందర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి గంగాధర్ శుక్రవారం పాఠశాలకు ప్రొజెక్టర్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థి ప్రొజెక్టర్ అందిచడం చాలా సంతోషకరమన్నారు.

ఆర్ట్స్ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు

కామారెడ్డి అర్బన్: స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫైనల్ ఇయర్ డిగ్రీ విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు, సాంస్కృతిక కార్యమాలు నిర్వహించారు. విద్యార్థులు తమ అనుభవాలు, అనుభూతులను పంచుకున్నారు. ప్రిన్సిపల్ విజయకుమార్, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, సమన్వయకర్తలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బస్వన్నపల్లిలో గ్రామ సంఘం సమావేశం

రాజంపేట: మండలంలోని బసన్నపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ సంఘ సమావేశం ఏర్పాటు చేసినట్లు సీసీ సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘాల ఏర్పాటు, పుస్తక నిర్వహణ,చిన్న సంఘాల ఆడిట్, స్కూల్ యూనిఫామ్‌ల కట్టుటపై సంఘ సభ్యులకు వివరించినట్లు తెలిపారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉచితంగా పాలిసెట్ శిక్షణ

కామారెడ్డి టౌన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి ఉచితంగా పాలిసెట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9133176213, 7075502187ను సంప్రదించాలన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల ఆందోళన

భిక్కనూరు : తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఆల్ తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం ధర్నా నిర్వహించి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరీకి వినతిపత్రం అందజేశారు. అధ్యాపకులు యాలాద్రి, సునీత, నరసయ్య, రమాదేవి, నిరంజన్, వైశాలీ, దిలీప్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ముదిరాజ్ ప్రముఖులకు సన్మానం

భిక్కనూరు: మండల కేంద్రంలో జరుగుతున్న పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం సందర్భంగా కామారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు గజ్జెల భిక్షపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్, ఐఐటీ పాట్నాలో విద్యనభ్యసించి శాంసంగ్ కంపెనీలో ఉద్యోగం సాధించిన గజ్జల శ్రీలేఖ, కామారెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్ దేవుని సూర్యప్రసాద్, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్‌లను భిక్కనూరు ముదిరాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఉన్నారు.

ఆలయ కమిటీకి..

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి,డైరెక్టర్ పాత లక్ష్మీ రాజంను ఆలయ ప్రాంగణంలో శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు విజయ్‌రెడ్డి, గాల్ రెడ్డి, రాంరెడ్డి, రవీందర్ రెడ్డి, నవీన్‌రెడ్డి ఉన్నారు.

పదోన్నతిపై వెళ్లిన కానిస్టేబుల్‌కు..

మాచారెడ్డి: మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మాలోత్ మదన్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు శుక్రవారం ఎస్సై అనిల్‌తో పాటు పోలీసు సిబ్బంది సన్మానించారు.